మండల స్థాయిలోనే సమస్యలకు పరిష్కారం

కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్

అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వివిధ సమస్యలపై ప్రజలు అందించే అర్జీలకు మండల స్థాయిలోనే పరిష్కారం చూపించాలని కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో సోమవారం నాడు "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించారు. డిఆర్ఒ జి.రామకృష్ణారెడ్డితో పాటు జిల్లా అధికారులతో కలిసి 410 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. శాఖల వారీగా వచ్చిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తెలియజేశారు. ఏ స్థాయిలో పరిష్కరించాల్సిన సమస్యలను ఆ స్థాయిలోనే పరిష్కరిస్తే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. మండల, రెవెన్యూ డివిజన్ అధికారులు అక్కడే అర్జీలకు పరిష్కారం చూపితే జిల్లా కేంద్రానికి అర్జీదారులు రావాల్సిన అవసరం ఉండదన్నారు. ఎస్‌ఒపి ప్రకారం ఎంపీడీవోలకు దరఖాస్తు చేసుకుంటే అక్కడే అర్జీలకు పరిష్కారం అందించాలన్నారు. ఆయా శాఖల పరిధిలో అధికారులు పనులు పక్కాగా చేయాలన్నారు. గృహ నిర్మాణ శాఖ పరిధికి సంబంధించి బ్రహ్మసముద్రం, గుత్తి, వజ్రకరూరు, ఉరవకొండ మండలాల్లో పురోగతి కన్పించాలన్నారు. అనుకున్న లక్ష్యాలను చేరుకునేలా ఈ శాఖ అధికారులు రోజువారీ కార్యచరణను రూపొందించుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు మల్టీపర్పస్ వీల్ చైర్ అందజేత

కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో సోమవారం నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులకు మల్టీ పర్పస్ వీల్ చైర్ ను కలెక్టర్ పంపిణీ చేశారు. వికలాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కక్కులపల్లికి చెందిన భవానీ శంకర్‌కు రూ.17,500 విలువజేసే మల్టీ పర్పస్ వీల్‌చైర్‌ను రాజసింహ సాయినాథ్ నగర్‌కు చెందిన వి.ఎల్.రామస్వామి జ్ఞాపకార్థంగా సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో అందించారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల సంక్షేమ శాఖ ఎడి రసూల్, సాయిట్రస్ట్ అధ్యక్షుడు విజయ్‌కుమార్, సభ్యులు రాఘవేంద్ర, నారాయణ నాయక్, విజ్ఞేష్ పాల్గొన్నారు.

పిఎబిఆర్ డ్యాం

పేరూరు డ్యాం

మన డ్యాంల భద్రత ఎంత..!

◆ గ్రీసుకు కూడా నిధుల్లేవు ..!

◆ రెండేళ్లుగా ప్రతిపాదనలకే పరిమితం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

తుంగభద్ర డ్యామ్ గేటు గల్లంతైన నేపథ్యంలో మన జిల్లాలో డ్యామ్‌ల భద్రతపై ప్రస్తుతం చర్చ నడుస్తోంది. నిర్వహణ ఉన్న తుంగభద్ర లాంటి చోటే ఇటువంటి ఘటన చోటు చేసుకుంటే ఇక్కడి పరిస్థితి ఏమిటన్న ప్రశ్న ఉత్పన్నం అవుతోంది. అనంతపురం జిల్లాలోని డ్యామ్‌లు గడిచిన నాలుగేళ్లుగా నిర్వహణకు నిధుల్లేకుండా ఉన్నాయి. కొన్ని డ్యామ్‌ల వద్ద పంటకాలువలకు నీరు విడుదల చేసే గేట్లు కూడా పడిపోయి ఉన్నాయి.

డ్యామ్‌లు, పంటకాలువల నిర్వహణ అధ్వాన్నం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో అతి పెద్ద రిజర్వాయర్ పెన్నఅహోబిళం రిజర్వాయర్. 11 టిఎంసిల నిలువ సామర్థ్యంతోనున్న ఈ రిజర్వాయర్ నిర్మాణంలోనే లోపముంది. స్పిల్‌వే నుంచే నీరు లీకేజీ అవుతూ ఉంది. దీన్ని నివారించేందుకు సుమారు రూ.10 కోట్లకుపైగా ఖర్చు పెట్టినా ఫలితం లేకుండా ఉంది. పూర్తి స్థాయి నిలువ సామర్థ్యంతో చేయాలంటే జియోమెంబ్రైన్ చేయాలని నిపుణులు సూచించారు. ఈ మేరకు అనేక దఫాలుగా ప్రతిపాదనలు సైతం పంపించారు. అయితే దీనిపై దృష్టి సారించిన దాఖలాలు లేవు. కేంద్ర ప్రభుత్వం తరుపున కూడా ఒక బృందం గతేడాది డ్యామ్ భద్రతా పరిశీలనకు రావాల్సి ఉంది. పాలకుల చొరవ లేకపోవడంతో రాష్ట్రానికి వచ్చిన నిపుణుల బృందం అటునుంచే అటు వెనక్కు వెళ్లిపోయింది. ఇక ఈ డ్యామ్ కూడా రెండేళ్లుగా గ్రీసు పెట్టడానికి కూడా నిధుల్లేకుండా ఉన్నాయి. డ్యామ్‌ల వద్ద ఎంతో కీలకమైన జనరేటర్ కూడా మరమ్మత్తులకు నిధులు విడుదలవలేదు. ఇక మిడ్‌పెన్నార్ , పేరూరు డ్యామ్‌ల పరిస్థితి ఇదే రకంగానున్నాయి. అనుకోకుండా భారీ వరదలొస్తే సమయానికి అవి పనిచేయకపోతే జరిగే నష్టం తీవ్రంగా ఉండే అవకాశాలున్నాయి. ప్రభుత్వాలు వీటి భద్రత నిర్వహణపై కనీస చర్యలు తీసుకుంటున్న దాఖలాల్లేవు

కాలువల పరిస్థితి దయనీయమే

జిల్లాకు సాగు,తాగునీటిని అందించే ప్రధాన కాలువల పరిస్థితీ దయనీయంగా మారింది. ప్రధానంగా జిల్లాకు శాశ్వత నీటి వనరుగానున్న తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ శిథిలావస్థకు చేరింది. వరదలొచ్చిన సమయంలోనూ కాలువ నిండుగా నీరు తీసుకోవడానికి వీల్లేకుండా 1500 క్యూసెక్కులకు మించి తీసుకుంటేనే ఎక్కడ గండిపడుతుందోనని భయపడాల్సిన పరిస్థితి ఉంది. దీని ఆధునీకరణ పనులు అర్థాంతరంగా ఆగి పోయి ఉన్నాయి. కనీస మరమ్మతుల కోసమైన రూ.30 కోట్లు అవసరమని అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. ఆ నిధులూ విడుదలవలేదు. పిఎబిఆర్‌కు కలిపే లింకు ఛానల్ మధ్యలో ఒకచోట పడిపోయి ఉంది. దాని మరమ్మతులూ జరగలేదు. తాత్కాలిక పనులతోనే సరిపెట్టుకుంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సాగునీటి రంగంలోని డ్యామ్‌లు, పంటకాలువల మరమ్మతులపై దృష్టి సారింస్తుదా లేక చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టు నష్టం జరిగాక మేలుకుంటుందో చూడాలి.

రూ.30లక్షలతో అన్నక్యాంటీన్ల మరమ్మతులు

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

అన్న క్యాంటాన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం నగరంలో రూ.30 లక్షలతో అన్నా క్యాంటీన్ మరమ్మతు పనులు చేయిస్తున్నామని, త్వరలోనే వీటిని పూర్తి చేసి పేదల ఆకలి తీర్చేలా అందుబాటులోకి తెస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. నగరంలో బళ్లారి బైపాస్‌లో ఉన్న అన్న క్యాంటీన్‌ను సోమవారం పరిశీలించారు. ఆగస్టు 15వ తేదీన అన్న క్యాంటీన్లను ప్రారంభిస్తున్న నేపథ్యంలో వాటిని పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు మూడు పూటలా అన్నం పెట్టే అన్న క్యాంటీన్లను తన అహకారంతో జగన్ రెడ్డి మూసివేయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలోని మూడు క్యాంటీన్లను 30లక్షలతో మరమ్మతులు చేయించామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం క్యాంటీన్లను ప్రారంభిస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ హరిబాబు, మున్సిపల్ ఈఈ సూర్య నారాయణ, ఏఈ శంకర్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి రాయల్ మురళి, టిడిపి రాష్ట్ర నాయకుడు గంగారామ్, జిల్లా ఉపాధ్యక్షుడు డిష్ నాగరాజు, బీసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి దళవాయి వెంకట నారాయణ, టిడిపి నాయకుడు రాయల్ మధు, తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగా తేజస్విని పాల్గొన్నారు.

నిర్మాలా సీతరామన్‌తో మాట్లాడుతున్న మంత్రి పయ్యావుల కేశవ్

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రితో పయ్యావుల భేటీ

ప్రజాశక్తి-ఉరవకొండ టౌన్

న్యూఢిల్లీలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్‌తో రాష్ట్ర ఆర్థిక ప్రణాళిక, వాణిజ్య పన్నుల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సోమవారం నాడు భేటీ అయ్యారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయల ఆధ్వర్యంలో రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.

చేపల పెంపకానికి బహిరంగ వేలం

రాయదుర్గం రూరల్ : మండలంలోని 74-ఉడేగోళం గ్రామ చెరువులో చేపలు పెంచుకునేం దుకు సోమవారం బహిరంగ వేలం నిర్వహించినట్లు పంచాయతీ కార్యదర్శి వేణు తెలిపారు. సర్పంచి దుర్గమ్మ అధ్యక్షతన జరిగిన వేలం పాటలో పది మంది పట పాడగా సిరిగేదొడ్డికి చెందిన రాజశేఖర్ రూ. 2.11 లక్షలకు దక్కించుకున్నాడు. ఈ ఏడాది నుంచి 2025 ఆగస్టు వరకూ చెరువులో చేపలు పెంచుకోవచ్చు అన్నారు.

అర్చకుల సమస్యలపై మంత్రికి వినతి

ప్రజాశక్తి-రాయదుర్గం

ఉమ్మడి అనంతపురం జిల్లా అర్చక సమాఖ్య ప్రతినిధులు సోమవారం విజయవాడలో దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కలిసి సమస్యలు వివరించి పరిష్కరించాలని కోరారు. స్పందించిన మంత్రి కొన్ని సమస్యలపై ఇప్పటికే నిర్ణయం జరిగిందని, మిగిలిన విషయాలపై చర్చించి త్వరలో నిర్ణయం తీసుకొని వీలైనంత త్వరగా అన్ని సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కలిసిన వారిలో సమాఖ్య అధ్యక్షులు వైపి.ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి దేవిరెడ్డిపల్లి రాజేష్ (రాయదుర్గం), కమిటీ సభ్యులు జి.శ్రీనివాసులు (గంజివారిపల్లి), వెంకటగిరయ్య(తాడిపత్రి), హనుమంతరాయుడు (మెచ్చిరి), పవన్, తదితరులు ఉన్నారు.

డీఎస్సీ, టెట్ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి : ఎమ్మెల్యే



కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం : నియోజకవర్గ పరిధిలో డీఎస్సీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న వారి కోసం ఉచితంగా డీఎస్సీ, టెట్ శిక్షణ ఇస్తున్నట్లు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. ఎమ్మెల్యే సోమవారం పట్టణంలోని తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శిక్షణ శిబిరాన్ని మండలంలోని 74-ఉడేగోళంలో ఉన్న టెక్స్‌టైల్ పార్కులో నిర్వహిస్తారన్నారు. నిపుణులైన శిక్షకుల చేత 4 నెలల పాటు శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. అభ్యర్థులు ఈనెల 18వ తేదీలోగా దరఖాస్తులను తమ క్యాంపు కార్యాలయంలో అందించాలని తెలిపారు. వివరాలకు 86399 98620 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

గర్భిణులు రక్తహీనతను అధిగమించాలి

బ్రహ్మసముద్రం : గర్భిణిగా నమోదు చేసుకున్న రోజు నుంచి కాన్పు అయ్యేంత వరకూ ప్రతి గర్భిణి రక్తం వృద్ధి ఎక్కువగా ఉండేలా చూసుకోవాలని, అందుకు తగినట్లు పౌష్టికాహారం తీసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ రాజేష్‌కుమార్ సూచించారు. రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులకు సోమవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ఉచితంగా ఐరన్, సుక్రోజ్ మాత్రలు అందజేశారు. గర్భిణులు రక్తహీనతను అధిగ మించేందుకు ఐరన్, సుక్రోజ్ మాత్రలతో పాటు మునగ, బచ్చలకూర ఆహారంలో తీసుకోవాలన్నారు. ప్రభుత్వాసుపత్రిలోనే పరీక్షలు చేయించుకుంటూ వాటిని వాడితే రక్తహీనత నుంచి విముక్తి కలిగి సుఖప్రసవం జరుగుతుందని తెలిపారు.

రోగులతో మాట్లాడుతున్న వైద్యాధికారి రాజేష్

వేపులపర్తి విద్యుత్ సబ్‌స్టేషన్ ముట్టడి

సబ్‌స్టేషన్‌ను ముట్టడించి నిరసన తెలుపుతున్న రైతులు, ప్రజలు

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

మండలంలో వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలో అంతరాయాన్ని అరికట్టి నాణ్యమైన విద్యుత్ ను అందించాలని కోరుతూ సోమవారం వేపులపర్తి సబ్ స్టేషన్ ముందు రైతులు బైఠాయించారు. రైతులు మాట్లాడుతూ 15 రోజులుగా విద్యుత్ కోతలతో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో విద్యుత్ ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొంద న్నారు. కనీసం రోజుకు 3 గంటల విద్యుత్ కూడా అందడం లేదని వాపోయారు. ఈ విషయంపై పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేదన్నారు. దీనిపై ఎఇ బాలచంద్ర మాట్లాడుతూ కొంతవరకూ సమస్య ఉన్న మాట వాస్తవమే, బుధవారం నుంచి అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యును అందజేస్తామని తెలిపారు. ధర్నాలో సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న ఆరు ఫీడర్లకు సంబంధించిన రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలపై మంత్రి ఆగ్రహం

అనంతపురం కలెక్టరేట్ : అనంతపురం జిల్లాలో అప్రకటిత కరెంట్ కోతలపై మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ కోతలను నిరసిస్తూ రెండు రోజులుగా అనంతపురం జిల్లాలో రైతులు ఆందోళనలు చేస్తున్న విషయంపై ఆయన స్పందించారు. కరెంట్ కోతల విషయంలో అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కోతల విధించే సమయాన్ని ప్రజలకు ముందస్తుగా సమాచారం ఇవ్వాలన్నారు. రైతులకు పూర్తి స్థాయిలో విద్యుత్ సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సరఫరాకు ఏవైనా ఇబ్బందులుంటే ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని సూచించారు. రైతులు ఇబ్బందులకు గురయ్యే ఘటనలు పునరావతం కాకుండా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-రాయదుర్గం

పురపాలక సంఘం పరిధిలో మరణించిన ఔట్ సోర్సింగ్ కార్మికుల కుటుంబాల్లో ఒకరికి తక్షణమే ఉద్యోగం కల్పించాలని, వారికి రూ. 2 లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేయాలని, కరోనా సమయం లో పని చేసిన కార్మికులను కొనసాగించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజు డిమాండ్ చేశారు. పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మున్సిపల్ కార్మికుల సమావేశంలో రాష్ట్ర, జిల్లా, స్థానిక తక్షణ కర్తవ్యాలపై కార్మికులతో మాట్లాడారు. అనారోగ్యంతో మృతిచెందిన రామాంజనేయులు భార్యకు ఫెడరేషన్ తరపున రూ. 30వేలు అందజేశారు. అనంతరం కార్మికులతో కలిసి మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి మున్సిపల్ కమిషనర్‌కు సమస్యలను వివరించి తక్షణం పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. సమావేశంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లికార్జున, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు రాము, తిప్పేస్వామి, మల్లేష్, కార్మికులు పాల్గొన్నారు.

ఎర్రకోట స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు అంగన్వాడీ కార్యకర్త

ప్రజాశక్తి-అనంతపురం

ఢిల్లీ ఎర్రకోటలో ఈ నెల 15వ తేదీన జరగనున్న స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు అనంతపురం జిల్లాకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్త ప్రత్యేక ఆహ్వానితురాలిగా ఎంపిక అయ్యారు. అనంతపురం అర్బన్ ప్రాజెక్ట్ నేతాజీ కాలనీ అంగన్వాడీ కార్యకర్తగా నిర్మల ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆహ్వానం అందింది. ఈ సందర్భంగా జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీదేవి, అనంతపురం అర్బన్ సీడీపీవో లలితమ్మలు అంగన్‌వాడీ కార్యకర్త నిర్మలను అభినందించారు. ఈ వేడుకలకు రాష్ట్ర వ్యాప్తంగా ఐదుగురు అంగన్‌వాడీ కార్యకర్తలు ఎంపిక కాగా అందులో అనంతపురం జిల్లాకు చెందిన నిర్మల ఉండడం అభినందనీయం అన్నారు.

కూలీలందరికీ ఉపాధి పనులు కల్పించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో కూలీలందరికీ ఉపాధి హామీ పనులు కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉపాధి హామీ గ్రామ సభలు జరపడంతో పాటు, పనులకు నిధుల కేటాయింపు పెంచాలన్నారు. జాబు కార్డులు పొందిన ప్రతీ కుంటుంబానికి 100 రోజులు పని కల్పించాలన్నారు. వ్యవసాయ కార్మికులు చేయగలిగిన 29 రకాల పనులు, కాలువలు తవ్వకం, మట్టి తీయటం, జంగిల్ క్లియరెన్స్ లాంటి పనులను ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాయన్నారు. ఉపాధి హామీ ద్వారా భూమి అభివద్ధి పనులు అనేకం ఉన్నాయని, ఆ పనులను విస్తృతంగా చేపట్టి తద్వారా గ్రామాభివద్ధి, మట్టి రోడ్లు ద్వారా వ్యవసాయ కార్మికులకి మరిన్ని ఉపాధి పనులు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

14న డయల్ యువర్ డిఎం

రాయదుర్గం : ఈ నెల 14వ తేదీ సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్య డయల్ యువర్ డిఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాయదుర్గం ఆర్టీసీ డిపో మేనేజర్ కే.సురేష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాయదుర్గం ఆర్టీసీ డిపో పరిధిలో ఆర్టీసీ బస్సు, రవాణా సౌకర్యాలు, సమస్య లు, సూచనలు, సలహాలను 99592 25863 నెంబర్‌కు ఫోన్ చేసి తెలుపవచ్చని డిఎం తెలిపారు.

గుప్తనిధుల కోసం చతుర్ముఖ పశుపతి విగ్రహం ధ్వంసం

ప్రజాశక్తి-రాయదుర్గం

మండలంలోని చదం గ్రామ సమీపంలో లింగాలబండపై వెలసిన దేశంలోనే అరుదైన చతు ర్ముఖ పశుపతి విగ్రహాన్ని ఆదివారం రాత్రి గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేశారు. గర్భగుడికి వేసిన ఇనుప తలుపును వెల్డింగ్ పరికరం సాయంతో తొలగించారు. గర్భగుడిలో ఒకే రాతిపై మధ్యన శివలింగం నాలుగు దిక్కుల్లో నాలుగు నందులు చెక్కబడి ఉండగా ఈ విగ్రహానికి దుండగులు క్షుద్ర పూజలు చేశారు. నాలుగు నంది కళ్లకు నల్లటి వస్త్రంతో ముసుగు తొడిగారు. పల్లేరుకాయలు, నిమ్మకాయలు, పూలు, పసుపు, కుంకుమ, తదితర వాటిని ఉపయోగించి పూజలు చేశారు. పశ్చిమ వైపున ఉన్న నంది తలను పగులగొట్టారు. అయితే రాయి మినహా ఏమీ కనిపించకపోవడంతో వదిలి వెళ్లారు. ఉదయం చదం గొల్లలదొడ్డి గ్రామం నుంచి ఆలయానికి వచ్చిన అర్చకుడు ఇదంతా గమనించి గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలిసిన వెంటనే రాయదుర్గం సిఐ శ్రీనివాసులు ఆలయాన్ని సందర్శించి అర్చకులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

చతుర్ముఖ పశుపతి విగ్రహంలో ఓవైపు నంది తలను తొలగించిన దుండగులు

1984లో లింగాలబండ సమీపంలోని గట్టి మల్లప్ప కొండ వద్ద పశువుల కాపరికి ఒక మట్టి ముంతలో బంగారు నాణేలు లభించాయి. అప్పటి నుంచి ఈ ప్రాంతంలో గుప్త నిధుల వేటగాళ్ల దాడు లు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే దుండగులు రెండుసార్లు ఆలయంలో ఉన్న చతుర్ముఖ పశుపతినాథుని విగ్రహాన్ని పక్కకు జరిపి తవ్వకాలు జరిపారు. ఆలయ ఆవరణలోని పార్వతీదేవి, కాళికాదేవి విగ్రహాలను ఓ మారు, ఆలయం వెలుపల ఉన్న నందీశ్వరుని విగ్రహాన్ని మరోమారు ధ్వంసం చేశారు. అయితే చతుర్ముఖ పశుపతి విగ్రహం సురక్షితంగా ఉండటంతో నిత్యం పూజలు జరిగేవి. ప్రస్తుతం గుప్తనిధుల వేటగాళ్లు చతుర్ముఖ విగ్రహం నంది తలను పగలగొట్టారు. విగ్రహాన్ని ధ్వంసం చేయడం పట్ల రాయదుర్గం హెరిటేజ్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాసాచార్, ప్రధాన కార్యదర్శి హులికుంటి మూర్తి, బిజెపి పట్టణ అధ్యక్షులు అంబాజీరావు, తెలుగు యువత నాయకులు పాటిల్ అజయ్ కుమార్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు. విగ్రహ పునఃప్రతిష్ఠ, ఆలయ పరిరక్షణకు ప్రభుత్వం, రాష్ట్ర పురావస్తు శాఖ చర్యలు చేపట్టాలని కోరారు.

ఎమ్మెల్యే కాలవ సందర్శన

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని చదం గ్రామ సమీపంలోని లింగాల బండపై వెలసిన పశుపతి నాథుని ఆలయంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పడమర నంది విగ్రహాన్ని ధ్వంసం చేసిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సోమవారం నాడు ఆలయాన్ని పరిశీలించారు. ఈ విషయంపై జిల్లా ఎస్పీ తో మాట్లాడినట్లు ఎమ్మెల్యే చెప్పారు. దేవదాయ శాఖ మంత్రి దృష్టికీ తీసుకెళ్తానన్నారు.

పంచాయతీలను వృద్ధిలోకి తీసుకురావాలి

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

మండలంలోని గ్రామపంచాయతీలు అన్ని రంగాల్లో వృద్ధి చెందేలా ప్రణాళికాబద్ధంగా పని చేయాలని ఈవోఆర్‌డి శ్రీరంగనాయకులు సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ తరగతులను ప్రారంభించారు. గ్రామాల్లో పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణ, సర్పంచుల విధులపై పంచాయతీ కార్యదర్శి కొల్లప్ప, మాస్టర్ ట్రైనర్లు భారతి, ప్రకాష్ అవగాహన కల్పించారు. పంచాయతీలకు ఆగస్టు 15 వేడుకల నిర్వహణకు రూ. 10వేల ఇవ్వడంపై సర్పంచులు హర్షం వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శులు వేణు, బసవరాజు, హేమంత్, అశోక్, శ్రీదేవి, సర్పంచులు పాల్గొన్నారు.

బొమ్మనహాల్ : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం పంచాయతీ సర్పంచుల కోసం ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులు ఎంపీడీవో రాఘవ ప్రారంభించారు. గ్రామ అభివృద్ధి, చెత్తతో సంపద, లిక్విడ్ మేనేజ్మెంట్, హక్కులు బాధ్యతలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. గ్రామాల్లో ప్రస్తుత పరిస్థితులు, స్థానికంగా నిధులు సమకూర్చుకునే మార్గాలు, వేస్ట్ మేనేజ్మెంట్‌పై శిక్షణ ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. తాగునీరు పొదుపు, డ్రెయినేజీ, దోమల నివారణ చర్యలపై శిక్షణ ఇచ్చినట్లు ఈఓఆర్‌డి దాస్ తెలిపారు. సర్పంచులు గ్రామాల్లో పర్యటించి సమస్యలను గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాల న్నారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీలు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, 17 మంది సర్పంచులు పాల్గొన్నారు.

ఓఎంసి గనుల్లో అక్రమ తవ్వకాలు

మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి

విలేకరులతో మాట్లాడుతున్న కాపు రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-రాయదుర్గం

డి.హీరేహాల్ మండలంలోని ఓబుళాపురం వద్ద ఉన్న ఓఎంసి గనుల్లో టిడిపికి చెందిన వ్యక్తులు అక్రమంగా తవ్వకాలు చేపట్టి సమీపంలోని స్పాంజ్ పరిశ్రమలకు అమ్ముకుంటున్నట్లు మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి ఆరోపించారు. ఆయన సోమవారం పట్టణంలోని తన నివాసం లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాబోయే రోజుల్లో ఓఎంసి గనుల్లో అక్రమ తవ్వకాలు చేపట్టి దానిని తనపై నెట్టే అవకాశం ఉందని సిబిఐకి ఫిర్యాదు చేసిన విషయాన్ని 'కాపు' గుర్తు చేశారు. తాజాగా ఓఎంసి గనుల ప్రాంతంలో అక్రమ మైనింగ్ జరిగిన ఛాయాచిత్రాలను ఆయన మీడియా ముందు ప్రదర్శించారు. ఓబుళాపురం మాజీ సర్పంచి వెంకటేశులు, ఆ గ్రామానికి చెందిన బసప్ప, బసవరాజు, సోమనగౌడ్, తాయప్ప, హెచ్.సిద్దాపురం గ్రామానికి చెందిన తలారి రాజశేఖర్, శివమూర్తి తదితరులు జెసిబి, లారీల సాయంతో ఇనుప నిజాన్ని పెద్దఎత్తున తవ్వి సమీపంలోని స్పాంజ్ ఐరన్ పరిశ్రమలకు అమ్ముకుంటున్నారని తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉందని, ఈ ఘటనలు ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చే విధంగా ఉన్నాయన్నారు. అక్రమ తవ్వకాలకు పాల్పడిన వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 15వ తేదీ పంద్రాగస్టు సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించి సెల్ఫీ తీసి 'హర్ ఘర్ తిరంగా' పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని కోరారు.

ఎయిడ్స్ నియంత్రణపై ర్యాలీ

రాయదుర్గం : రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ, మాస్ ఎడ్యుకేషన్ స్వచ్ఛంద సంస్థ, రాయదుర్గం ప్రభుత్వాసుపత్రి ఐసిటిసి విభాగం ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని డాక్టర్ మెర్సీ జ్ఞాన సుధ, డాక్టర్ ఉమా మహేష్, డాక్టర్ రాధ, డాక్టర్ మోహన్‌సాయి ప్రారంభించారు. ర్యాలీలో స్థానిక వెంకటేశ్వర ప్రయివేట్ జూనియర్ కాలేజీ విద్యార్థులు పాల్గొని హెచ్.ఐ.వి/ఎయిడ్స్, సుఖ వ్యాధులపై అవగాహన కల్పించారు. హెచ్.ఐ.వి/ఎయిడ్స్ సంక్రమణ, నివారణ జాగ్రత్తలను వివరించారు. వ్యాధి గ్రస్తుల పట్ల వివక్ష చూపవద్దన్నారు. అలాగే క్షయ, సుఖ వ్యాధులు, చికిత్స గురించి వివరించారు. ర్యాలీలో ప్రాజెక్ట్ మేనేజర్ నీలకంఠ, ఐసిటిసి కౌన్సిలర్ కృష్ణమూర్తి, వైద్య ఆరోగ్య సిబ్బంది అల్తాఫ్, నీలకంఠ, సురేష్‌బాబు, శశికళ, రమణమ్మ, కృష్ణవేణి, మాస్ ఎడ్యుకేషన్ సొసైటీ విహాన్, సిబ్బంది శివ తదితరులు పాల్గొన్నారు.

ఎంపిడిఒలు బాధ్యతల స్వీకరణ

నార్పల : మండల నూతన ఎంపిడిఒగా దివాకర్ సోమవారం స్థానిక కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా కడప జిల్లా పులివెందులకు వెళ్లిన ఆయన ఎన్నికల అనంతరం కొత్త ప్రభుత్వం ఏర్పడటంతో తిరిగి నార్పల ఎంపిడిఒగా బాధ్యతలు స్వీకరించారు.

పుట్లూరు : మండల ఎంపిడిఒగా యోగానందరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల నేపథ్యంలో పుట్లూరు నుంచి బదిలీ అయిన యోగానందరెడ్డి ఎన్నికల అనంతరం తిరిగి ఎంపిడిఒగా బాధ్యతలు స్వీకరించారు.

పెద్దవడుగూరు : మండల ఎంపిడిఒగా కుళ్లాయిస్వామి సోమవారం స్థానిక కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా మండల పరిస్థితులపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

హెచ్ఐవి నియంత్రణపై ర్యాలీ

గుత్తి : హెచ్ఐవి, ఎయిడ్స్ నియంత్రణపై హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థకు చెందిన టిఐ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో సోమవారం గుత్తిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి వద్ద పిపి యూనిట్ వైద్యాధికారి డాక్టర్ ఎల్లా రాముడు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఐవి, ఎయిడ్స్ నియంత్రించేందుకు రెండు నెలల పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థకు చెందిన టిఐ ప్రాజెక్టు మేనేజర్ జి.రమేష్, ఎంఎండి సందీప్ కుమార్, ఏఎన్ఎం జి.కవిత, ఓఆర్డబ్ల్యులు షేక్ శంషాద్ బేగం, జి.రాధాకుమారి, జోష్ణ, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

In The Court of The VII th Addl. District Judge Family Court, Ananthapuramu
E.P. No: 01/2024 in O.S. No:39/2023
Between:
J.Vijaya Kumar Naik ...**Petitioner/D.Hr**
And
Dudekula Dada Kalander ...**Respondant/J.Dr**
J.Dr కి Order 21 Rule 66 CPC Notice
To,
Dudekula Dada Kalander S/o Late D.Budem Sab Flat No:002, R/at D.No:6-2-695, 4th Cross, Bhagyalakshmi Apartments, Ram Nagar, Ananthapuramu
డిక్రీ హోల్డర్‌కు రావలసిన E.P. మొత్తము వసూలు చేయుటకు గాను E.P.లోని హెద్యూలు ఆస్తిని జప్తు చేసియున్నారు. సదరు E.P. వేలము షరతులు నిర్ణయించుటకు మీ యొక్క హాజరు నిమిత్తం 04/09/2024వ తేదికి వాయిదా వేసి యున్నారు. అందులకు మీకు ఆక్షేపణలున్న యెడల సదరి దినము ఉదయం 10:30 గం॥లకు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై కోర్టు యందు హాజరు కావలెను. లేని యెడల మీ పరోక్షమునందు పై అర్జీని విచారించి తీర్మానించెదరు.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
A.SURESH KUMAR,
Advocate, Anantapuramu.
Cell:9440204098.

In The Court of The Addl. Senior Civil Judge, Ananthapuramu
I.A. No: 139/2018 in O.S. No:458/2016
Between:
State Bank of India Rep by its Chaief Manager, ADB Branch, Ananthapuramu
...**Petitioner/Plaintiff**
And
R.Niranjana Reddy ...**Respondant/Defendant**
Notice to Respondant
To,
R.Niranjan Reddy S/o G.Govinda Reddy, R/at Kalagalla Village, Kuderu Mandal, Ananthapuramu Dist.
పై నెంబరు కేసులో ఫైనల్ డిక్రీ కొరకు ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తం 19/08/2024 వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
V.VIJAYALAKSHMI,
Advocate, Anantapuramu.

In The Court of The Addl. Senior Civil Judge, Ananthapuramu
I.A. No: 146/2024 in H.M.O.P. No:411/2023
Between:
V.Anasuya ...**Petitioner**
And
Parandhama ...**Respondant**
Notice to Respondant
To,
Parandhama S/o Hanumantharayappa, Agriculture Coolie R/at D.No:12, Karutlapalli, Kuderu Mandal, Ananthapuramu.
పై నెంబరు కేసులో రెస్పాండెంటు అయిన మీ హాజరు నిమిత్తం 12/09/2024 వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
V.PRAKASH, A.FAYAZ,
Advocates, Anantapuramu.Cell:8500591710

In The Court of The Prl. District Judge, Ananthapuramu
E.P. No:511/2023 in A.A. No:278/2021
Between :
M/s Shriram Finance Ltd Ananthapuramu Branch-1, Rep by its Special Power of Attorney/ Authorized Signatory.Y.Rami Reddy ...**Decree Holder**
And
Singanamala Kartheek and another
...**Judgement Debtors**
Notice to J.Dr No:1& 2
J.Dr :1 :Singanamala Kartheek S/o Singanamala Subbaramaiah, R/at D.No:12-3-482, Jesus Nagar, Near Renuka Yellamma Temple, Ananthapuramu.
J.Dr :2 :Darapaneni Adi Kesavulu S/o Darapaneni Chandrayudu, R/at D.No:7-50, Peddamogalayapalli Village, Medapuram Post, Chennekothapalli Mandal,
పై నెంబరు కేసులోJ.Drs, అయిన మీ హాజరు నిమిత్తం 19/08/2024 వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
A.PRABHAKAR REDDY,
Advocate, Anantapuramu.Cell:9441380404.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్



వినతిపత్రం సమర్పిస్తున్న కార్మిక సంఘం నాయకులు

అనంతపురం కార్పొరేషన్‌లో పనిచేస్తున్న పారిశుధ్య ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం నాయకులు కోరారు. సోమవారం కార్పొరేషన్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల వేదికలో సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం నాయకులు హెల్త్ ఆఫీసర్ విష్ణుమూర్తికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనేక ఏళ్లుగా పెండింగ్ ఉన్న రెగ్యులర్ కార్మికుల సరెండర్ లీవ్‌లు, పారిశుధ్య విభాగంలో చనిపోయిన కార్మికులకు వారి కుటుంబీకుల్లో ఒకరికి ఉద్యోగం కల్పించాలని కోరారు. అలాగే సమాన పనికి సమాన వేతనం, రెగ్యులర్ కార్మికులకు సంబంధించిన యూనిఫారం, చీరలు, టవళ్లు, చెప్పులు, కొబ్బరి నూనె, బకాయి ఉన్న స్టిచ్చింగ్ చార్జెస్, పనిముట్లు, ఎన్నికల టైంలో ఎలక్షన్ డ్యూటీ చేసిన కార్మికులకు ఓటు చెల్లించాలని డిమాండ్ చేశారు. క్లాప్ ఆటో డ్రైవర్లకు బకాయి ఉన్న జీతాలు వెంటనే ఇవ్వాలని, కోవిడ్ మలేరియా గ్యారేజ్ కార్మికులకు, బకాయి ఉన్న జీతాలు చెల్లించాలన్నారు. పెరిగిన నగరానికి అనుగుణంగా 200 మంది కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు 1వ పట్టణ కార్యదర్శి వెంకటనారాయణ, రెగ్యులర్ అధ్యక్ష, కార్యదర్శులు ముత్తరాజు, నల్లప్ప, నారాయణస్వామి, బండారి ఎర్రిస్వామి, సాకే తిరుమలేశు, కమిటీ సభ్యులు బంగ్లా రాఘవేంద్రప్రసాద్, శ్రీనివాసమూర్తి, పెన్నా కమల్, ప్రభాకర్, క్లాప్ ఆటో కార్యదర్శి పెదయ్య, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో మున్సిపల్ కార్మికుడు మృతి

సిఐటియు నాయకుల నివాళి

ప్రజాశక్తి-తాడిపత్రి

నివాళులర్పిస్తున్న సిఐటియు నాయకులు

మున్సిపల్ కార్యాలయంలోని ఇంజనీరింగ్ సెక్షన్ విభాగంలో పని చేస్తున్న మున్సిపల్ కార్మికులు రాముడు సోమవారం గుండెపోటుతో మృతిచెందాడు. మండల పరిధిలోని రావివెంకటాంపల్లికి చెందిన రాముడు తాడిపత్రిలో మున్సిపల్ కార్యాలయంలోని ఇంజనీరింగ్ విభాగంలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈనేపథ్యంలో సోమవారం ఇంట్లో గుండెపోటుకు గురై మృతిచెందాడు. విషయం తెలుసుకున్న సిఐటియు నాయకులు గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. విషయాన్ని మున్సిపల్ కమిషనర్ రామ్మోహన్‌కు తెలియజేయడం తో స్పందించిన ఆయన అంత్యక్రియల ఖర్చులకు రూ.15వేల రూపాయల చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం సిఐటియు నాయకులు మాట్లాడుతూ అధికారులు మృతిచెందిన కార్మికుని కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, ఎక్స్‌గ్రేషియా, పిఎఫ్, బీమా వంటి సౌకర్యాలను త్వరగా అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు జగన్మోహన్‌రెడ్డి, రామాంజనేయులు, ఇంజనీరింగ్ సెక్షన్ కార్మికులు జుబేర్, శ్రీరాములు, ప్రసాద్, ఓబయ్య, బాల నారాయణ, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల పట్టాలివ్వాలి : సిపిఎం

వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

అనంతపురం కలెక్టరేట్ : రాజీవ్‌కాలనీ పంచాయతీలోని మహదేవనగర్, గణేనాయక్ నగర్‌లలో నివాసం ఉంటున్న అర్హులైన పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వాలని సిపిఎం నగర 1వ కమిటీ కార్యదర్శి వి.రామిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో అనంతపురం తహశీల్దార్ హరికుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేనాయక్ కాలనీలో 15ఏళ్ల నుంచి దాదాపు 20 మంది పేదలు కాపురం ఉంటున్నారన్నారు. అలాగే మహదేవనగర్ రైల్వేట్రాక్ పక్కన ఉన్న స్థలంలో పేదలు నివసిస్తున్నారన్నారు. వారందరికీ పట్టాలు ఇవ్వాలని కోరారు. ఇందుకు తహశీల్దార్ స్పందిస్తూ అర్హులకు త్వరలోనే పట్టాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కమిటీ సభ్యులు, రాజీవ్‌కాలనీ ఉప సర్పంచి మసూద్, నూరుల్లా, డేవిడ్, కాలనీవాసులు కేశవ, గిరి, వెంకట్ నారాయణ, శీనా, రాము, ఆది, గౌష్, పవన్, షేక్ష, వేణు, రవి, తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో విజ్ఞతతో వ్యవహరించాలి : ఎస్పీ

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రాం, యూట్యూబ్, టెలిగ్రాం, తదితర సోషియల్ మీడియాలో పోస్టులు పెట్టేటప్పుడు విజ్ఞతతో వ్యవహరించాలని ఎస్పీ కెవి.మురళీకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. అనాలోచితంగా పోస్టులు పెట్టడం వల్ల జరిగే కీడును గుర్తించాలన్నారు. ముఖ్యంగా కులాలు, మతాల మధ్య విద్వేషాలు సృష్టించే పోస్టులు ఎట్టిపరిస్థితుల్లో పెట్టవద్దని సూచించారు. వ్యక్తిగత ప్రతిష్ట దెబ్బతీసే విధంగానూ పార్టీల మధ్య చిచ్చులు పెట్టేలాంటి పోస్టులకు దూరంగా ఉండాలన్నారు. మహిళలు, చిన్నారుల పట్ల అసభ్యకర, అభ్యంతరకర పోస్టులు పెడితే సహించబోమన్నారు. సోషల్ మీడియా అకౌంట్స్, పోస్టులను పర్యవేక్షించేందుకు జిల్లా స్థాయిలో ప్రత్యేక బందం ఏర్పాటు చేశామన్నారు. జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా సాంకేతిక పరిజ్ఞానంలో సుశిక్షితులైన సిఐ సిబ్బందితో 24గంటలూ పర్యవేక్షణ చేపట్టామన్నారు. సోషల్ మీడియాను పాజిటివ్ విషయాలను విస్తృతం చేసేందుకు, దూరప్రాంతాల్లో ఉన్న మిత్రులు, బంధువులను దగ్గరి చేర్చే విధంగా వినియోగించుకోవాలని కోరారు. చాలామంది యువత సోషల్ మీడియాకు అలవాటు పడి ఫేక్ అకౌంట్స్ ప్రారంభించి అనుచిత పోస్టులు పెట్టి, చట్టాన్ని అతిక్రమిస్తున్నారన్నారు. అంతేకాకుండా, తమ విలువైన సమయాన్ని వృథా చేసుకుంటూ, లక్ష్యాలను చేరుకోవడంలో విఫలమవుతున్నారన్నారు. యువత సాంకేతికతను అందిపుచ్చుకొని నిర్దేశించుకున్న లక్ష్యానికి చేరుకోవాలన్నారు. సోషల్ మీడియాలో విద్వేషాలు రెచ్చగొడుతూ, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని వినతి

పుట్లూరు : మండలంలోని చెరువులను నీటితో నింపి తాగునీటి సమస్య పరిష్కరించాలని కౌలురైతు సంఘం నాయకులు కోరారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో తహశీల్దార్ శేషారెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని సుబ్బరాయ సాగర్ డ్యాం, పుట్లూరు, కోమటికుంట్ల, గరుగుచింతలపల్లి, బొప్పేపల్లి చెరువులకు నీరు తీసుకొస్తే మండలవ్యాప్తంగా తాగునీటి సమస్య ఉండదన్నారు. దీనికితోడు సాగునీరు కూడా విడుదల చేస్తే రైతులు పంటలు సాగు చేస్తారన్నారు. ఇప్పటికైనా స్పందించి మండలానికి తాగు, సాగునీరు అందించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపి కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు విటి.రామాంజనేయులు, ఎపి రైతుసంఘం మండల గౌరవాధ్యక్షుడు టి.బాలగురయ్య, మండల ఉపాధ్యక్షుడు చిన్ని కృష్ణుడు, మండల కార్యదర్శి సత్తార్ గోపాల్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గోపాలకృష్ణ, రైతుసంఘం మండల కమిటీ సభ్యులు ఓబుల్‌రెడ్డి, నాగమణేంద్ర, రైతులు అంకిరెడ్డి, ఆంజనేయులు, ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

అనంతపురం : వైద్య, ఆరోగ్య శాఖలో పని చేస్తున్న సిబ్బంది సమస్యల పరిష్కారానికి యూనియన్ కృషి చేస్తోందని ఎపి తెలుగునాడు మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు తెలిపారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నాగరాజు అధ్యక్షతన ఎపి తెలుగునాడు మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం దృష్టి సారిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు పోతుల లక్ష్మీనరసింహులు, ఎపి తెలుగునాడు మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు భానుమూర్తి, కడప జిల్లా అధ్యక్షులు మల్లయ్య, రాష్ట్ర నాయకురాలు అరుణకుమారి పాల్గొన్నారు.

సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

జాతీయ యువజన అవార్డు గ్రహీత బిసాటి భరత్

ప్రజాశక్తి-అనంతపురం

నేటి యువత సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని జాతీయ యువజన అవార్డు గ్రహీత బిసాటి భరత్ సూచించారు. ప్రగతి పథం యూత్ అసోసియేషన్, ఎస్ఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయంలోని ఫార్మసీ విభాగంలో ఆదివారం అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత సేవా భావం నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలన్నారు. ప్రపంచంలో అనేక అవకాశాలు ఉన్నాయన్నారు. అయితే అందుకు తగ్గ నైపుణ్యాలు యువతలో తగ్గిపోతున్నాయన్నారు. కావున యువత సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన యువతకు ప్రశంసాపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీత బిసాటి జీవన్‌కుమార్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ జి.సోమశేఖర్, ఎన్ఎస్-ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సత్యసౌమ్య, రామకృష్ణ, సేవాసమితి సెక్రటరీ ప్రవీణ్ వేదాద్రి, జ్యోత్స్న, ప్రగతి పథం యూత్ అసోసియేషన్ సభ్యులు కె.జయమారుతి, వై.పవన్, రైపర్ ఎన్ఎస్ఎస్ స్టూడెంట్ కోఆర్డినేటర్ ఎం.కిరణ్‌సాయి, మహేష్, అరుణ్ ఐస్‌క్రీమ్ డిస్ట్రిబ్యూటర్ రాఘవేంద్ర యాదవ్, గణేష్ పవన్, తదితరులు పాల్గొన్నారు.

కరువు జిల్లాగా ప్రకటించాలని వినతి

ప్రజాశక్తి-శింగనమల

వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

అనంతపురాన్ని కరువు జిల్లాగా ప్రకటించి సహాయక చర్యలు చేపట్టాలని సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో తహశీల్దార్ బ్రహ్మయ్యకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో జిల్లావ్యాప్తంగా 32 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించినా కరువు సహాయక చర్యలు చేపట్టలేదన్నారు. వర్షాలు కురవని నేపథ్యంలో వందశాతం సబ్సిడీతో పెసర, ఉలవ, కొర్ర, జొన్న, రాగి, కంది విత్తనాలను పంపిణీ చేయాలని కోరారు. అలాగే 200 రోజులు ఉపాధి పనులు కల్పించి రోజుకు రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రకటించిన హామీ మేరకు పెట్టుబడి సాయం రూ.20వేలను రైతుల ఖాతాల్లో జమ చేయాలని కోరారు. హెచ్చెల్సీ చివర ఆయకట్టు సలకం చెరువు వరకూ నీరు అందించాలని, బైపాస్ కాలువ పనులు పూర్తి చేయాలని, చెప్పుల పరిశ్రమను ఓపెన్ చేసి శిక్షణ తీసుకున్న వారికి ఉపాధి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు సుంకన్న, జయరాముడు, ఎర్రిస్వామి, శ్రీనివాసులు, నాగేంద్ర, ఆంజనేయులు, కుళ్లాయిస్వామి, ఆంజనేయులు, ఓబిరెడ్డి, వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

కూలీలందరికీ పనులు కల్పించాలి

ప్రజాశక్తి-పామిడి

వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

ఉపాధి హామీ పథకం కింద వ్యవసాయ కూలీలందరికీ పనులు కల్పించాలని సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వామపక్షాల నాయకులు అనిమిరెడ్డి, వీరభద్రస్వామి, రహీమ్ మాట్లాడుతూ జాబ్‌కార్డు కలిగిన ప్రతి కూలీకీ పని కల్పించాలన్నారు. పామిడి గ్రామపంచాయతీలో పామిడి, కొత్తపల్లి, కొండాపురం గ్రామాల్లో వ్యవసాయ కూలీలకు పనులు లేక ఇబ్బందులు పడుతున్నారు. వారందరికీ పనులు కల్పించాలన్నారు. అలాగే ఉపాధి పనుల్లో అవినీతిని అరికట్టి కనీస వేతనం రోజుకు రూ.600 కూలి ఇవ్వాలని, 200 రోజులు పనులు కల్పించాలని, వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలని కోరారు. అనంతరం ఎంపిడిఒ ప్రభాకర్‌నాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లేష్, నాగరాజు, చౌడప్ప, సారున్‌బీ, కోదండరామిరెడ్డి, బాబా ఫక్రుద్దీన్, ఈశ్వరయ్య, సూర్యనారాయణరెడ్డి, ఉపాధి హామీ పథకం కూలీలు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పరికరాల దొంగలను అరెస్టు చేయాలి

వజ్రకరూరు : ఉరవకొండ మండల పరిధిలోని ఆమిద్యాల గ్రామంలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో క్రీడా పరికరాలు దొంగలించిన నిందితులపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిద్ధార్థ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ సోమవారం పాఠశాలకు చేరుకుని క్రీడా సామగ్రి చోరీకి గురైన గదిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం రాత్రి పాఠశాల రూమ్ గదిలో తాళాలు పగులగొట్టి క్రీడా వస్తువులు దొంగలించి క్రీడాకారులకు ఇబ్బందులు కలిగించారన్నారు. వెంటనే పోలీసులు నిందితులను పట్టుకుని శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు హిరణ్య, మండల నాయకులు సురేష్, నందు, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

కస్తూరిబా పాఠశాల తనిఖీ

ఆత్మకూరు : మండల కంద్రంతోపాటు కురుగుంటలోని కస్తూరిబా పాఠశాలలను జిల్లా న్యాయ సేవాధికారి జి శివప్రసాద్ యాదవ్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. లీగల్ లిటరసీ క్యాంపులో భాగంగా ఆయా పాఠశాలలను పరిశీలించి విద్యార్థినులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇందులో భాగంగా బాలికల వసతి గృహాలు, తరగతి గదులు, వంటగది, మరుగుదొడ్లను క్షుణ్ణంగా పరిశీలించి విద్యార్థినులను సమస్యలపై ఆరాతీశారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

ర్యాగింగ్ వ్యతిరేక దినోత్సవం

వజ్రకరూరు : ఉరవకొండ మండల పరిధిలోని చిన్న ముషూరు గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం జాతీయ ర్యాగింగ్ వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాగింగ్ చేయడం వల్ల కలిగే అనర్థాలను ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ వై.సురేష్‌బాబు వివరించారు. తర్వాత కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ కోఆర్డినేటర్ కె.వెంకటేష్‌నాయక్ లఘు వీడియో ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పి.చంద్రబాబు, పి.రామానాయుడు, టివి.చైతన్యరెడ్డి, బి.చంద్రమోహన్, కె.ధనలక్ష్మి, జెడ్ మోసెస్, రవీంద్రనాథ్, ఎస్.అలీఫాహుస్సేన్, జి.రాజేష్, పి.రామన్న, పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని 'ఫ్యాప్టో' ఆందోళన

అనంతపురంలో ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పిస్తున్న ఉపాధ్యాయసంఘాల నాయకులు

అనంతపురం కలెక్టరేట్ : సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు సోమవారం అనంతపురంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం సర్దుబాటుపై తీసుకున్న నిర్ణయాన్ని పున పరిశీలించాలని కోరారు. ఎలాంటి సమీక్షలు నిర్వహించకుండా ఆగమేఘాలపై ఉపాధ్యాయ లోకాన్ని గందరగోళ పరుస్తూ నిర్ణయం తీసుకున్నారన్నారు. ప్రధానంగా 117 రద్దు చేయాలని కోరారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ ఆయా సమస్యలను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో యుటిఎఫ్ సంఘం నాయకులు నాగేంద్ర, శేషు, ఎస్‌టియు సభ్యులు ఫణిభూషణ్, సురేష్‌కుమార్, ఏపీటీఎఫ్ నాయకులు ఓబులేష్, భాగ్యరాజ్, టిఎన్‌యుఎస్ నాయకులు నాగభూషణం నాయుడు, తదితరులు ఉన్నారు.

రాయదుర్గం : ఉపాధ్యాయుల పని సర్దుబాటును నిరసిస్తూ ఫ్యాప్టో ఆధ్వర్యంలో సోమవారం డి.హీరేహాల్ ఎంఆర్‌సి కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డి.హీరేహాల్ ఎంఇఒ లక్ష్మన్నకు ఫ్యాప్టో నాయకులు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు మోహన్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి జాఫర్, మండల ఉపాధ్యక్షులు దేవరాజు, యుటిఎఫ్ మండల గౌరవాధ్యక్షులు హనుమంతప్ప, ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, నాయకులు వన్నూరప్ప, హరినాథ్, కన్నడ టీచర్స్ అసోసియేషన్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరాలప్ప, ఎన్‌టిఎ సంఘం మండల ప్రధాన కార్యదర్శి అయ్యన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బదిలీ ఎంపిడిఒలకు సన్మానం

నార్పల : బదిలీపై వెళ్తున్న ఎంపిడిఒ రాముడును కార్యాలయ సిబ్బందితోపాటు నాయకులు సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి నాగేశ్వరావు, జడ్పిటిసి నాగరత్నమ్మ, ఇఒఆర్‌డి శైలజారాణి, అధికారులు ఉమాదేవి, అశ్వర్థనాయుడు, శ్రీనివాసులు, వరలక్ష్మీ, లక్ష్మిదేవి, సూర్యకుమారి, వహిదా, చరణ్, శ్రీనివాసులు, పరుశురాం, మల్లికార్జున, శ్రీహర్ష వెంకటరెడ్డి, ఎంపిటిసిలు శంకర్‌యాదవ్, రాజారెడ్డి, పద్మనాభరెడ్డి, సర్పంచులు రామ్‌భూపాల్‌రెడ్డి, రమణకుమారి, కుళ్లాయిరెడ్డి, నాగన్న, ఎపిఒ ఎర్రమ్మ, ఉపాధి హామీ సిబ్బంది సీనియర్ అసిస్టెంట్ నూరు మహమ్మద్, జూనియర్ అసిస్టెంట్ నరేంద్ర, టైపిస్టు ఆనంద్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

వజ్రకరూరు : బదిలీపై వెళ్తున్న ఉరవకొండ ఎంపిడిఒ సుబ్బరాజును సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో ప్రజాప్రతినిధులు, గ్రామ కార్యదర్శులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి నరసింహులు, విస్తీర్ణ అధికారి చంద్రమౌళి, పరిపాలన అధికారి జయరాములు, తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన తుంగభద్ర గేటును అమర్చాలి

అనంతపురం కలెక్టరేట్ : నీటి ఉధృతితో కొట్టుకుపోయిన తుంగభద్ర జలాశయం 19వ గేటును తక్షణమే అమర్చాలని ఎపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గేట్ కొట్టుకుపోవడం వల్ల ప్రాజెక్టులోని నీరు వృథాగా దిగువకు వెళ్లి రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ముఖ్యంగా ఈ ఖరీఫ్ సీజన్‌లో అసలే లోటు వర్షపాతంతో పంటలు దెబ్బతింటున్న స్థితిలో భూగర్భజలాలు సైతం అడుగంటిపోయే ప్రమాదం ఉందన్నారు. తుంగభద్ర ప్రాజెక్టు నీటితో పంటలు పండించుకునే అనంతపురం, కర్నూలు జిల్లా రైతుల ఆశలు అడియాశలవుతున్నాయన్నారు. ఈ పరిస్థితుల్లో కొట్టుకుపోయిన గేటుకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

స్థలాలు కబ్జా చేస్తే చర్యలు : ఎస్పీ

అనంతపురం క్రైం : ఫోర్జరీ డాక్యుమెంట్లు సృష్టించి స్థలాల కబ్జాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని ఎస్పీ కెవి.మురళీకృష్ణ హెచ్చరించారు. సోమవారం జిల్లా పోలీసు కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజల నుంచి 115 ఫిర్యాదులు అందగా కొంతమంది విలువైన స్థలాలను ఫోర్జరీ డాక్యుమెంట్లు సృష్టించి భూములు కబ్జా చేయడం, సైబర్ నేరాలపై కేసులు ఉన్నాయన్నారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదులతో కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపడతామని తెలిపారు.

నేడు చౌడేశ్వరీదేవి గ్రామోత్సవం

యల్లనూరు : మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన చౌడేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారి ప్రాణ ప్రతిష్టను పురస్కరించుకుని మంగళవారం గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో గ్రామోత్సవంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని స్థాపిద్దాం

అనంతపురం : డ్రగ్స్ రహిత సమాజాన్ని స్థాపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కోపరేటివ్ అధికారి అరుణకుమారి, సహకార బ్యాంకు సిఇఒ సురేఖారాణి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక బ్యాంకులో డ్రగ్స్ రహిత సమాజానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డిజిఎం సుఖదేవబాబు, విజయచంద్రారెడ్డి, నాబార్డ్ అనురాధ పాల్గొన్నారు.

ఎస్ఆర్.రంగనాథన్‌కు నివాళి

అనంతపురం కలెక్టరేట్ : గ్రంథాలయ పితామహుడు ఎస్ఆర్.రంగనాథన్ వర్ధంతని పురస్కరించుకుని సోమవారం నగరంలోని జిల్లా గ్రంథాలయంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమా మాట్లాడుతూ రంగనాథన్ గ్రంథాలయాల అభివృద్ధికి విశేష కృషి చేశారని కొనియాడారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

యల్లనూరు : వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని వాల్మీకి సంఘం రాష్ట్ర కార్యదర్శి దొడ్లో హనుమంతు కోరారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తహశీల్దార్ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. ఇందుకు తహశీల్దార్ స్పందిస్తూ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘం మండల అధ్యక్షుడు పవన్‌కుమార్, ఉపాధ్యక్షుడు బొప్పేపల్లి ఓబులేసు, కుక్కల రామాంజనేయులు, యూత్ విభాగం ఉపాధ్యక్షుడు మారుతీప్రసాద్, సుబ్బయ్య, ప్రసాద్ శ్రీహరి పాల్గొన్నారు

శ్రీచైతన్యలో విద్యార్థి నాయకుల ఎన్నిక

అనంతపురం : నగరంలోని బ్రాంచి-8 శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో సోమవారం ఓటుహక్కుపై అవగాహన కల్పిస్తూ విద్యార్థి నాయకుల ఎన్నికను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులందరూ ఓటుహక్కును వినియోగించుకున్నారు. అంతకుముందు ఎజిఎం సుబ్బారెడ్డి ఓటుహక్కుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నేత్రావతి, జోనల్ కోఆర్డినేటర్ శ్రీనివాసులు, డీన్ అరుణ్‌కిరణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంచాయతీలకు పూర్వవైభవం

బెలుగుప్ప : పంద్రాగస్టు వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు పంచాయతీలకు నిధులు పెంచడంతో పూర్వవైభవం లభించిందని జనసేన పార్టీ మండల అధ్యక్షులు కాశంశెట్టి సుధీర్ సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకునేందుకు గతంలో పంచాయతీకి రూ.100, మేజర్ పంచాయతీలకు రూ.250 ఇచ్చేవారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పవన్‌కళ్యాణ్ దాన్ని రూ.10వేలు, రూ.25 వేలకు పెంచడం సంతోకరమన్నారు.

జాతీయ స్కేటింగ్‌లో హేత్విక్‌రెడ్డి ప్రతిభ

అనంతపురం : తమిళనాడులోని పొల్లాచిలో జరిగిన జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీల్లో జిల్లాకు చెందిన హేత్విక్‌రెడ్డి ప్రతిభ కనబరిచి రజతం సాధించింది. నగరంలోని ఎన్‌టిఆర్ రోలింగ్ స్కేటింగ్ అకాడమీలో కోచ్ ఆంజనేయులు వద్ద శిక్షణ తీసుకుని జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరచడం పట్ల జిల్లా క్రీడాకారులు అభినందిస్తున్నారు.

'డ్వామా'కు ఐఎస్ఓ గుర్తింపు

అనంతపురం కలెక్టరేట్ : జిల్లాలోని డ్వామా కార్యాలయానికి ఐఎస్ఓ గుర్తింపు లభించింది. ఈమేరకు సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో గ్లోబల్ మేనేజ్‌మెంట్ సర్టిఫికేషన్ సర్వీసెస్ సంస్థ అందించిన సర్టిఫికెట్‌ను డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డికి కలెక్టర్ వినోద్‌కుమార్ అందజేశారు.

ఆర్థిక సాయం

పామిడి : నాలుగు రోజులు క్రితం పాముకాటుతో మృతిచెందిన పట్టణంలోని 1వవార్డు కొండాపురం గ్రామానికి చెందిన వన్నెపోగుల ఓబిలేసు రెండవ కుమార్తె మానస కుటుంబానికి టిడిపి నాయకులు ఆదివారం ఆర్థికసాయం అందజేశారు. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ తనయుడు ఈశ్వర్ ఆదేశాల మేరకు టిడిపి నాయకుడు ఆర్ఆర్.రమేష్ రూ.5వేలు, కొండాపురం టిడిపి నాయకుడు నరసప్ప రూ.5వేల చొప్పున బాలిక కుటంబానికి అందజేశారు. ఈకార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వివాహిత అనుమానాస్పద మృతి

మృతిచెందిన లలిత

గార్లదిన్నె : మండల పరిధిలోని పాత కల్లూరుకు చెందిన లలిత (22) సోమవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పామిడి మండలం పాలెం గ్రామానికి చెందిన లక్ష్మీదేవి, ఓబులేసు దంపతుల కుమార్తె లలితను నాలుగేళ్ల క్రితం పాత కల్లూరు చెందిన మల్లికార్జునకు ఇచ్చి వివాహం చేశారు. పెళ్లయినప్పటి నుంచి భర్త అనుమానంతో లలితను వేధించేవాడు. దీంతో అనేకమార్లు పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీలు చేసి పంపేవారు. 10 రోజుల క్రితం కూడా భార్యను కొట్టి పుట్టింటికి పంపడంతో తల్లిదండ్రులు నచ్చజెప్పి తిరిగి భర్త వద్దకు పంపారు. ఈనేపథ్యంలో సోమవారం ఉన్నట్టుండి ఉరేసుకుని మృతిచెందడం పట్ల తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేశారు. తమ కూతురు అనుమానాస్పదంగా మృతిచెందిందని మృతురాల తల్లిదండ్రులు గార్లదిన్నె పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి.. ఐదుగురు అరెస్టు

కళ్యాణదుర్గం : కంబదూరు మండలంలోని చెర్లోపల్లి గ్రామ సమీపంలో సోమవారం పేకాట స్థావరంపై ఎస్ ఆంజనేయులు, పోలీసులు దాడి చేసి ఐదుగురిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.37,900 నగదు, 10 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ మాట్లాడుతూ అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేసి బాబు, నాగరాజు, శ్రీనివాస్, రామాంజిలను అరెస్టు చేశామని తెలిపారు.